క్లుప్తంగా

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారుడికి హెల్మెట్ పెడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఎదుట ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతోపాటు ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్‌లు అందజేసి మాట్లాడారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఎస్‌ఐ రంజిత్, ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

శివస్వాముల కాశీయాత్ర



కాశీ వెళ్తున్న శివస్వాములు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో శివస్వాములు జ్యోతిర్ముడి ధరించి కాశీ తరలివెళ్లారు. మండలంపాటు శివదీక్ష చేసిన స్వాములు బుధవారం శివాలయం వద్ద మనోహర్‌గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయం శివుడికి పూజలు చేసి జ్యోతిర్ముడిని ధరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం శివస్వాములు వాహనాలలో కాశీ బయలుదేరి వెళ్లారు.

అందరికీ పరీక్షలు చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కొల్చారం(నర్సాపూర్): గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరికీ పరీక్షలు చేయాలని జిల్లా వైద్యాధికారి చందునాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. శిబిరంలో వసతులను పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు చేశారు. అవసరమైన వారికి రీడింగ్ అద్దాలను అందజేయాలని, పరీక్షలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి క్యాంపులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొల్చారం వైద్యాధికారి రమేష్, సర్పంచ్ సువర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘానికి విరాళం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాపన్నపేట(మెదక్): మల్లంపేట ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి హైకోర్టు సీనియర్ న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్ బుధవారం విరాళం ప్రకటించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన ముందుగా సీతారాముల స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి తన వంతుగా 2,16,000 విరాళం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ బైండ్ల సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ బాపురెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, నర్సింహులు సత్యనారాయణ, మెదక్ జిల్లా ఓబీసీ జనరల్ సెక్రటరీ ఆకుల సుధాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలాటలో కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

మనోహరాబాద్(తూప్రాన్): ఎవరైనా అనుమానితులుంటే తమకు సమాచరమివ్వాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలం పాలాట గ్రామంలో వేకువజామున సీఐ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సరైనా పత్రాలు లేని బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్లను అద్దెకిచ్చేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సందీప్ రెడ్డి, తూప్రాన్, వెల్దుర్తి ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు రాని సమావేశం ఎందుకు?

మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): మండల సమావేశంలో అధికారులు హాజరు కాకుంటే సమస్యలు ఎవరికి చెప్పాలని సభ్యులు ప్రశ్నించారు. బుధవారం ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల గైర్హాజరుపై ఆగ్రహించిన సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశానికి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మిషన్ భగిరథ డీఈ శ్రీనివాస్, ఏఈ నిఖిల, ఏఓ లక్ష్మిప్రవీణ్, ఏపీఓ గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్‌గౌడ్, రాణమ్మ, సక్కుబాయి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. గత సమావేశంలో అధికారులు అంతంతమాత్రమే వచ్చారని, సమావేశానికి రానివారికి నోటీస్‌లు ఇవ్వాలని కోరినా ఫలితంలేదని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతు అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యేలా చూడాలని కోరగా, త్వరలోనే తిరిగి సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సమాధానం ఇచ్చారు. సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లతో పాటు రైతులకు రుణమాఫీ చేయకుండా సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని టీపీసీసీ సభ్యులు సుప్రభాత్‌రావు, మామిండ్ల ఆంజనేయులు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్, టి.మాందాపూర్ తండా, గజగట్లపల్లి గ్రామాలలో చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజ్ రమణ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాళేశ్వరం సాగునీరు సిద్దిపేట, సిరిసిల్లకు మాత్రమే వచ్చాయన్నారు. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజ్ రమణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీమన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సత్యనారాయణగౌడ్, టి.మాందాపూర్ ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, అంజాగౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్యామ్ సుందర్, మండల నాయకులు మల్లేశం, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి తీరుతో పార్టీకి నష్టం

ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ నియోజవర్గంలో డీసీసీ అధ్యక్షుడు కంటారెడ్డి తిరుపతిరెడ్డి తీరుతో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి ఆరోపించారు. బుధవారం చిన్నశంకరంపేటలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శివకుమార్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఆవుల గోపాల్‌రెడ్డి, మిర్జాపల్లి ఎంపీటీసీ హలవత్ సక్కుబాయితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండలంలో హాథ్ సే హాథ్ జోడోయాత్రపై కనీస సమాచారం ఇవ్వకుండా యాత్ర నిర్వహించడంపై మండిపడ్డారు. తిరుపతిరెడ్డి అనుచరవర్గం ఏకపక్ష నిర్ణయాలతో సమస్యలు తలెత్తుతున్నాయని, ఇది పార్టీకి మంచి కాదని అన్నారు. డీసీసీ హోదాలో ఉన్న వారు అందరినీ కలుపుకొని పోవాలని, పార్టీకి నష్టం కలిగించే చర్యలను మానుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల పాలిట వరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎస్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై, చికిత్స చేయించుకునే స్తోమత లేనివారు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని అన్నరాఉ. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు భిక్షపతి, నగేష్, శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఈనెల 15వ తేదీ వరకు మండలంలోని ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రం చిలప్‌చెడ్ లో గల ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి మాట్లాడుతూ ఈ నెలఖరులోగా ప్రతి గ్రామంలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. వైకుంఠధామాలకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని, అక్కడ ట్యాంకర్ వినియోగించకూడదన్నారు. వైకుంఠధామాల చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు వందశాతం వినియోగించాలని, డంపింగ్ యార్డులలో పేరుకుపోయిన ప్లాస్టిక్, తయారు చేసుకున్న వర్మీ కంపోస్ట్ ఎరువులు అమ్మేందుకు, కొనుగోలుదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యాంకుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. బుధవారం పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం రాజేశ్వర్ పర్యవేక్షించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంగా హర్షవర్ధన్, డీఈఓగా వైష్ణవి, కలెక్టర్‌గా గౌతమ్, డిప్యూటీ డీఈఓగా దశరథ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్, దయానంద్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వలు నిర్మించాలి

డీఎల్‌పీఓ యాదయ్య



రహీంగూడ పంచాయతీ వద్ద డీఎల్‌పీఓ యాదయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): రహీంగూడ తండాలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, త్వరగా మురికి కాలువలు నిర్మించాలని నర్సాపూర్ డీఎల్‌పీఓ యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని రహీంగూడ తండాలోగల డంపింగ్ యార్డు, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ రహీంగూడ తండాలో క్రీడా ప్రాంగణ నిర్మాణానికి స్థలం గుర్తించామన్నారు. తండాలో డంపింగ్‌యార్డులు సక్రమంగా వినియోగించడం లేదని, దానిని వందశాతం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి అఖిల్‌న ఆదేశించారు. డీఎల్‌పీఓ వెంట సర్పంచ్ గన్నిబాబు, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, స్థానిక నాయకుడు బన్సీలాల్ తదితరులు ఉన్నారు.

యాత్రకు ప్రజల నుంచి ఆదరణ

నర్సాపూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో పార్టీలో కొత్త జోష్ వచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి ప్రజలకు బ్రహ్మరథం పట్టారని, పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి కూడా ప్రజల నుంచి స్పందన లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ యాత్ర చేస్తామని అన్నారు. కాంగ్రెస్ హయాంలో పథకాలను ప్రజలకు వివరిస్తామని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజీపేట రాజేందర్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజీపేట రాజేందర్ తెలిపారు. బుధవారం కౌడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట కమిటీ ఆదేశాలమేరకు ఈనెల 10నుండి 25వ తేదీవరకు మండలంలోని పది శక్తి కేంద్రాలలో కార్నర్ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. కార్యకర్తలు పార్టీ పటిష్టత కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు రాకేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షుడు, పేట మండల అబ్జర్వర్ పత్రి రామకృష్ణ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు బి.శ్రావణ్‌కుమార్, బి.కృష్ణ, దమ్ము సాయిలు, విశ్వనాథం, సురేష్, సాయిలు తదితరులున్నారు.

కౌడిపల్లి విద్యుత్‌శాఖ ఏఈగా కోటేశ్వరరావు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండల విద్యుత్‌శాఖ ఏఈగా కోటేశ్వరరావు బుధవారం నియమితులయ్యారు. ఈయన సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సెక్షన్‌లో సబ్‌ఇంజనీర్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇప్పటి వరకు చిలిప్‌చెడ్ మండల ఏఈ రాంబాబు కౌడిపల్లి ఏఈగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నవాబుపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాట్లాడుతూ నేత్ర సమస్యలు లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, గ్రంథలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీడీఓ నవీన్‌కుమార్, వైద్యులు సాయిసౌమ్య పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

◆ **వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

తూప్రాన్: లంబాడీల ఐక్యవేదిక (లైవ్)ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ 284 జయంతి సందర్భంగా ఈ నెల 12న హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో జరిగే భోగ్ బండార్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జైపాల్, బంజారా నాయకులు మూడ్ పకీరా, హాలియా నాయక్, శ్రీనివాస్, మోహన్ రాథోడ్, మూడ్ రాంజీ, మూడ్ సంగ్య, మాలోత్ శివ, రవి, శ్రీనివాస్, బాన్సిలాల్, స్వామి పాల్గొన్నారు.

◆ **క్రీడా సామగ్రి పంపిణీ**

తూప్రాన్: పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఉన్న జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామంతాపూర్ తండాకు చెందిన యువతకు జీఎమ్మార్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వెస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, మేనేజర్ పరందామస్ క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు.

◆ **కూలీల సంఖ్య పెంచాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లచ్చిరెడ్డిగూడెంలో ఉపాధి పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. రోజుకు 50 మంది కూలీలకు పని కల్పించాలన్నారు.

◆ **లక్ష్మీనర్సింహస్వామికి పూజలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రాష్ట్ర టూరిజం అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ధనుంజయ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి, అర్చకులు విద్యాకర్‌చారి, వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింలుగుప్తా, వైశ్య సంఘం నాయకులు ప్రవీణ్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా తదితరులు ఉన్నారు.

◆ **ఘనంగా మల్లన్న జాతర**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి, కౌడిపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో బుధవారం మల్లికార్జునస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మదేవికి భక్తులు బండ్లను ఊరేగించి బోనాలు తీశారు.

◆ **కోనాపూర్‌లో శివ పడిపూజ**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్ హనుమాన్ మందిరం ఆవరణలో బుధవారం శివ మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీత రెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ మంజుల, మేఘమాల, సర్పంచ్ రమేష్, రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లిలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సార రామాగౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశాలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సార రామాగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా నిర్వహించే కంటి పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ సంజీవ్, డాక్టర్ శ్రీకాంత్, శీలక్ష్మీ, ఉపసర్పంచ్ సాలె వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి గోల్యానాయక్, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో బుధవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ కంటి వెలుగు క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామంలో మూడురోజుల పాటు నిర్వహించే క్యాంపులో గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరం ఉన్నవారికి కంటి అద్దాలను ఉచితంగా ప్రభుత్వం అందించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పూజారి హరి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, గురుపూజ, గోపూజ, స్వస్తివాచనం, ప్రతిస్థానకల్పం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, మృతంగ్రహణం, అంకురారోపణం, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ మంటప సర్వతో భద్ర మండల దేవతాహ్వానం, మహా కలశ స్థాపన, దేవతా మూలమంత్ర అనుష్టానం పూజలు నిర్వహించారు. సాయంత్రం అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ఠ, జలాదివాసం, ప్రదోష పూజ, మంగళహారతి చేశారు. నిత్య అన్నదానం కోసం బీఆర్ఎస్ నాయకుడు పైడి శ్రీధర్ గుప్తా పది క్వింటాల బియ్యం అందజేశారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని లర్నింగ్ కర్వ్ లైఫ్ స్కిల్స్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ సుబ్బు పరమేశ్వరన్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కో ఫౌండర్ గాయత్రి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేతతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలపై కొల్చారం, రామాయంపేట, శంకరంపేట, మెదక్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు రోడ్డు ప్లే, డ్రామా రూపంలో ।రిసోనేట్–2023। పేర నృత్య ప్రదర్శనలో తెలియజేశారు. అనంతరం పరమేశ్వరన్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పిల్లల్లో సామాజిక బావోద్వేగ నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. ఇప్పటివరకు తెలంగాణలోని 200 పాఠశాలల్లో 40వేల మంది పిల్లల్లో నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్వప్న, కవిత, ప్రణీత, తులసి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందజేయాలి



పరిశ్రమల వాడ వద్ద ధర్నాకు దిగిన రైతులు

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమల వాడ కోసం భూములు కోల్పోయిన వారిలో మిగిలిన వారికి నష్టపరిహారం వెంటనే అందజేయాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని కొండాపూర్ గ్రామ పరిధిలో టీఎస్ఐఐసీ పరిశ్రమల వాడల కోసం 119 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేసి వారి నుంచి సేకరించిందని తెలిపారు. కాగా ఇందులో 19 మందికి ఇప్పటికి నష్టపరిహారం ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అధికారులు చెక్కులు ఇచ్చే వరకు పరిశ్రమల వాడలో పనులు చేయనివమన్నారు. పరిశ్రమల వాడలో జరుగుతున్న పనులను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్‌యాదవ్, వార్డుసభ్యులు సత్యనారాయణగౌడ్, నాయకులు రాముయాదవ్, నాగరాజు, నవీన్, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



రంగంపేటలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

కొల్చారం(నర్సాపూర్): సోషల్ మీడియాలోచూసి పంటలో తెగుళ్ల నివారణకు యూరియాను డీజిల్‌తో కలిపి చల్లొద్దని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి రైతులకు సూచించారు. బుధవారం రంగంపేటలో వరి పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు అసత్య ప్రచారాలను నమొద్దని, పంటలో తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. యూరియాతో డీజిల్ కలిపి చల్లితే నీటిపై డీజిల్ తెట్టగా మారి మొక్క వేర్లకు హాని చేస్తుందన్నారు. యాసంగిలో మండల వ్యాప్తంగా అధిక మొత్తంలో వరి పంట సాగైందని, మొగి పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింత



ఎమ్మెల్యే కాన్వాయ్ ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): గుంతలమయంగా మారిన గోమారం- నవాబుపేట రోడ్డు మరమ్మతు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నవాబుపేటలో కంటి వెలుగు శిబిరం ప్రారంభించేందుకు వస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాన్వాయ్‌ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అశోక్, మన్నె నర్సింలు, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ.. రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు చెప్పినా స్పందించడం లేదని వాపోయారు. గ్రామంలో పార్ట్–బీలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, ఈ నెలాఖరులో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు శాంతించారు.